క్లుప్తంగా

సంకల్ప్ మెటీరియల్ పంపిణీ



మొవ్వ: ఏపీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత పెంచడానికి మొవ్వ క్షేత్రయ్య జూనియర్ ఇంటర్ మీడియట్ ప్రభుత్వ కళాశాలలో గురువారం 'సంకల్ప్- 2025'కు శ్రీకారం చుట్టారు. విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించడానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సీనియర్ అధ్యాపకులు తయారుచేసిన క్వశ్చన్ బ్యాంకు మెటీరియల్‌ను కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద శాస్త్రి చేతుల మీదగా విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు వాసు బాబు, శ్రీనివాసరావు, సర్వారెడ్డి, మోహన రావు, పద్మా తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం



గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరులో సీసీ రోడ్డును గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము గురువారం ప్రారంభించారు. స్థానిక పోల్‌రాజ్ కాల్వ గట్టుపై రూ.52.50లక్షల జాతీయ ఉపాధి హామీ నిధులతో నిర్మించినట్లు ఎమ్మెల్యే రాము తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దిలీప్‌కుమార్, తహసీల్దార్ బి.లోకరాజు, పీఆర్ ఏఈ నాగేశ్వరరావు, ఏపీఓ పి.రాంప్రసాద్, కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

చినుకులతో రైతన్న ఆందోళన



గుడ్లవల్లేరు: వాయుగుండ ప్రభావంతో కురిసిన చినుకులతో రైతులు బెంబేలెత్తారు. ఆరుగాలం పండించిన పంట ఎక్కడ నీటిపాలు అయిపోతుందోనని వరికోతలు వడివడిగా కోయించారు. కుప్పలు వేసే పనుల్లో ఎన్నో వ్యయప్రయాసల ఓర్చారు. కోతలు ముమ్మరమవుతున్న సమయంలో వర్షాలు పడటంతో పంట చేతికి అందే పరిస్థితులు కనబడటం లేదని రైతులు వాపోతున్నారు.

అనుమతి లేకుండా చెరువు పూడిక పనులు

మండవల్లి: లోకుమూడి పరిధిలో ఏలూరు వెళ్లే రహదారి వెంబడి పవర్ సబ్‌స్టేషన్ సమీపంలోని సుమారు ఎకరం స్థలంలో గురువారం చెరువు పూడిక పనులు నిర్వహించారు. నాలా అనుమతులు లేకుండా పూడిక పనులు చేపట్టడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పూడిక పనుల కోసం మట్టిని చింతపాడు నుంచి ట్రాక్టర్ల ద్వారా తెస్తున్నారు. దీంతో చింతపాడు నుంచి లోకుమూడి వరకు ప్రధాన రహదారి అధ్వానంగా మారింది.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక అర్చనలు



ముదినేపల్లి రూరల్: షష్ఠి ఉత్సవాల్లో భాగంగా సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామికి గురువారం అష్టోత్తర శతకలశార్చన, అభిషేక కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను వేదికపై ఉంచి 108 కలశాలతో ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్ర శర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు చేశారు. ఆలయ సహాయ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి, పాలక వర్గ సభ్యులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కొండంగి గ్రామానికి చెందిన శ్రీబాల భక్త మురళీ కృష్ణ భజన సమాజంకు చెందిన చిన్నారుల మురళీకోలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

నేరాల విచారణలో సీసీ కెమెరాలే కీలకం

బంటుమిల్లి: నేరాల విచారణలో సీసీ కెమెరాలు ఎంతగానో సాయపడుతున్నాయని బందరు డీఎస్పీ అబ్దుల్ సుభాన్ అన్నారు. స్థానిక పోలీసు స్టేషన్ ఆధ్వర్యంలో బంటుమిల్లిలో దాతల సహకారంతో పలు కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను, మోనిటర్‌ను గురువారం డీఎస్పీ ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో అవసరమైన దాదాపు 90 వేల సీసీ కెమెరాల కోసం ప్రభుత్వానికి నివేదిక ఇచ్చామన్నారు. బంటుమిల్లిలో దాతలు ముందుకొచ్చి దాదాపు రూ.2 లక్షల విలువ చేసే సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించినందుకు ఆయన వారికి అభినందనలు తెలిపారు. దేవాలయాలు, చర్చిలు, మసీదుల వద్ద కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచనలు ఇచ్చామని చెప్పారు. 216 జాతీయ రహదారిపై ఎక్కడ సీసీ కెమెరాలు ఉన్నదీ ఎస్ఐ గణేష్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు.

ఇల వైకుంఠపురంలో..

- మహిమాన్వితుడు డోకిపర్రు వేంకటేశ్వరస్వామి
- నేటి నుంచి బ్రహ్మోత్సవాలు
- ఆలయంలో దశావతారాలు
- భారీ రాజగోపురం



విద్యుత్ దీపాలంకరణతో డోకిపర్రు వేంకటేశ్వరస్వామి ఆలయం

గుడ్లవల్లేరు: మహిమాన్వితుడు డోకిపర్రు వెంకటేశ్వస్వామి. ఈ ప్రాంతాన్ని ఇల వైకుంఠపురమని భక్తులు భావిస్తుంటారు. డోకిపర్రుల శ్రీ భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థాన బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ ఆలయానికి జిల్లా నలు మూలల నుంచి భక్తులతో పాటు పర్యాటకులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుంటున్నారు. ఇదొక పుణ్య క్షేత్రంగానే గాక పర్యాటకులు వచ్చే కేంద్రంగా స్వర్గధామంగా మారింది. 2015 మే నెలలో ఈ ఆలయాన్ని ప్రారంభించారు. గుడ్లవల్లేరు మండలంలోని డోకిపర్రులో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ(సి.ఎస్.ఆర్) కింద సకల వసతులతో మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ వారు సర్వాంగ సుందరంగా ఆలయాన్ని నిర్మించారు. దీనిని భక్తులు లోకల్ తిరుపతిగా కూడా భక్తితో పిలుస్తుంటారు.

అద్భుత ఆలయాలతో..

స్వామివారి దేవస్థాన సన్నిధిలో ఎన్నో అద్భుతమైన ఆలయాలు ఉన్నాయి. దీనితో జిల్లాలోని భక్తులు ఈ దేవస్థానాన్ని మరొక తిరుపతిగా అభివర్ణిస్తారు. ఈ ఆలయాలను ఖైరతాబాద్ వినాయక శిల్పి రాజేందర్ పర్యవేక్షణలో నిర్మించారు. అపర బ్రహ్మలా రాజేంద్ర తన కళా నైపుణ్యంతో తిరుపతిలోని శ్రీవారి ఆలయాన్నే ఇక్కడ దింపేశారు. అలివేలు మంగ, పద్మావతీ దేవి, వినాయక, సీతారాముల ఆలయాలతో పాటు దశవతారాల ఉపాలయాలను చక్కని శిల్పకళా నైపుణ్యంతో నిర్మించారు. ఆలయ నిర్మాణంలో భారీ రాజ గోపురాన్ని నిర్మించారు. దేవస్థానానికి నాలుగు పక్కల కూడా గోపురాల పనుల్ని కూడా ఇటీవలే పూర్తి చేశారు.

స్వామివారి సన్నిధిలో ఆలయాలు ఇవి..

లక్ష్మీదేవి, విఘ్నేశ్వరుడు, గరుడ, ఆంజనేయ స్వామివార్ల ఆలయాలను నిర్మాణం చేశారు. మత్స్యావతారం, కూర్మావతారం, వరాహమూర్తి, కృష్ణుడు, రాముడు, వామనుడు, నరసింహ స్వామి, కల్కి, పరుశురాముడు, బలరామ దేవతా అవతార మూర్తులు ఇక్కడున్న ఉపాలయాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఇక్కడ నిర్మించిన బేడీ ఆంజనేయ స్వామివారి ఆలయం, కోనేరు అందర్నీ ఆకట్టుకుంటున్నాయి. కేవలం భక్తులే కాకుండా ఈ అద్భుతమైన కళాత్మక ఆలయ, ఉపాలయాలను తిలకించేందుకు భక్తులు, పర్యాటకులు తండోపతండాలుగా వస్తున్నారు. సెలవుల్లో దీనిని పిక్నిక్ స్పాట్‌గా కూడా ఎన్నుకుని పర్యాటకులు వస్తున్నారు.



పుష్పాలంకరణలో స్వామివారి ఉత్సవమూర్తులు



ఆంజనేయ స్వామివారి ఆలయం



ఆలయ ప్రాంగణంలోని కోనేరు

నేడు దాసాంజనేయ స్వామి కల్యాణోత్సవం

కైకలూరు: స్థానిక సువర్చలా సహిత దాసాంజనేయ స్వామి 56వ వార్షిక కల్యాణోత్సవం శుక్రవారం ఉదయం 8 గంటలకు జరుగుతుందని నిర్వాహకులు గురువారం చెప్పారు. శని, ఆదివారాల్లో సహస్ర నామ అష్టోత్తర పూజలు నిర్వహిస్తామన్నారు. సోమవారం దేవాలయం వద్ద అఖండ అన్నసమారాధన జరుగుతుందన్నారు.

15 లోపు బీమా ప్రీమియం చెల్లించాలి

ముదినేపల్లి రూరల్: మండలంలో మినుము, పెసర సాగు చేస్తున్న రైతులు ఈ నెల 15వ తేదీ లోపు బీమా ప్రీమియం చెల్లించాలని వ్యవసాయాధికారి బి.వేణుగోపాల్ కోరారు. కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటలు నష్టపోతే పరిహారం పొందడానికి ప్రీమియం ఉపయోగపడుతుందన్నారు. ఆసక్తి ఉన్న రైతులు ఎకరానికి రూ.60 చొప్పున ప్రీమియం మొత్తాన్ని చెల్లించాలన్నారు. వివరాలకు స్థానిక వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని కోరారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ

పెదపారుపూడి: పెదపారుపూడిలోని ప్రాథమిక పాఠశాల-1లో గురువారం దివ్యాంగులకు ఫిజియోథెరపీ క్యాంపు నిర్వహించారు. ఫిజియోథెరపిస్టు కె. శ్యామ్ ప్రసాద్ ఏడుగురు చిన్నారులకు థెరపీ చేశారు. క్రమం తప్పకుండా థెరపీ చేయిస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఐఆర్పీలు హరిబాబు, కిషోర్‌బాబు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు వినియోగించుకోండి



భట్లపెనుమర్రులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్



నందిగామలంక రెవెన్యూ సదస్సు..

భట్లపెనుమర్రు(మొవ్వ): రెవెన్యూ సదస్సులు వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. మొవ్వ మండలంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో భాగంగా నాలుగో రోజు గురువారం భట్లపెనుమర్రు గ్రామంలో అత్యధికంగా 40 అర్జీలు అందజేశారు. సర్పంచ్ మట్టా ఇందిర అధ్యక్షతన జరిగిన సభలో మండల స్పెషల్ ఆఫీసర్ డి.విజయవర్ధన రావు, తహసీల్దార్ మస్తాన్, డెప్యూటీ తహసీల్దార్ సీహెచ్ రఘురాం, రీ సర్వే డీటీ జగన్మోహనరావు, ఆర్ఐ ఏ విజయ్‌దుర్గ పాల్గొన్నారు.

గుడివాడరూరల్: మండలంలోని రామనపూడి గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ వాసిరెడ్డి రామకోటేశ్వరరావు ప్రజలు, రైతుల వద్ద నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రతిష్ఠాత్మకంగా సదస్సులు నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో పీడీఎస్ డెప్యూటీ తహసీల్దార్ కిరణ్, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు ఇంటూరి గజేంద్ర, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

కైకలూరు: భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయని జిల్లా ఫిషరీస్ జాయింట్ డైరెక్టర్, ప్రత్యేకాధికారి కేఎస్‌వీనాగలింగాచార్యులు, ఇన్‌చార్జి తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం చెప్పారు. పెంచికలమర్రు కమ్యూనిటీ హాలు వద్ద గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మొత్తం 12 అర్జీలను గ్రామస్తులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ జయమంగళ కాసులు, కూటమి నేతలు బలే ఏసురాజు, సుబ్బరాజు, వీఆర్వో రాజారత్నం, దేవదాయశాఖ సిబ్బంది చుక్కా శ్రీను, ఫారెస్టు, ఫిషరీస్ సిబ్బంది హాజరయ్యారు.

ముదినేపల్లి రూరల్: భూసమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని చూపేందుకే రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, తహసీల్దార్ జేఎస్ సుభానీ తెలిపారు. పెదగొన్నూరు సచివాలయం వద్ద గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సభలో 19 అర్జీలు అందాయి. వీఆర్వోలు, సర్వేయర్లు, పలువురు రైతులు పాల్గొన్నారు.

అప్పికట్ల(పెదపారుపూడి): మండలంలోని జువ్వనపూడి గ్రామంలో గురువారం రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించారు. తహసీల్దార్ వై.రంగారావు, సర్పంచ్ నీలపాల పేరేసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు

మండవల్లి: రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ గోపాల్ అన్నారు. నందిగామలంకలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వీఆర్వో శ్రీనివాసరావు, రీసర్వే డీటీ సుధారాణి, వీఆర్వోలు, అటవీశాఖ అధికారి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించండి

పామర్రు: ధాన్యం సేకరణలో జరుగుతున్న అన్యాయంపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరుతూ శాంతియుత ర్యాలీని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ గురువారం పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు 13వ తేదీ ఉదయం 9.30 గంటలకు మచిలీపట్నంలోని ఆర్ అండ్ బి గెస్టు హౌస్ వద్ద ఉన్న మహాత్మాగాంధీ విగ్రహం నుంచి జిల్లా రైతులతో కలిసి శాంతియుతంగా వెళ్లి కృష్ణా జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు.

గుడివాడ టౌన్: అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ చేస్తున్న కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించనున్నట్లు ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు స్థానిక ఫ్లై ఓవర్ వద్ద గల థియేటర్ నుంచి మచిలీపట్నం కలక్టరేట్ కార్యాలయానికి వెళుతున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం



విద్యార్థినికి చెక్కును అందజేస్తున్న క్లబ్ సభ్యులు

గుడివాడ టౌన్: రోటరీక్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా పేద విద్యార్థినికి విద్య నిమిత్తం ఆర్థిక సాయం చేసినట్లు గుడివాడ రోటరీక్లబ్ అధ్యక్షుడు టి.ఎస్.రాజశేఖర్ తెలిపారు. గురువారం క్లబ్ కార్యాలయంలో చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ సిద్ధార్థ మహిళా కళాశాలలో ఇంటర్ 2వ సంవత్సరం విద్యార్థిని ఎస్. నవ్యశ్రీ తండ్రి లేరు. ఆ పేద విద్యార్థినికి కళాశాల ఫీజు నిమిత్తం ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకుని రూ.21 వేలు వితరణ అందజేసినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ బేసిక్ ఎడ్యుకేషన్ అండ్ లిటరసీ చైర్మన్ కె. వెంకటేశ్వరరావు, క్లబ్ కార్యదర్శి జి. కిరణ్ బాబు, ట్రెజరర్ ఎస్. ప్రసాదు, పోలియో వింగ్ చైర్మన్ ఎ. సుబ్రహ్మణ్యేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గోమాతకు సీమంతం



గోమాతకు సీమంతం చేస్తున్న సర్పంచ్ చంద్రశేఖరరావు దంపతులు

పామర్రు: గోమాతను పూజిస్తే సకల దేవతలను పూజించినట్లే అని జమీదగ్గుమిల్లి సర్పంచ్ కూనపరెడ్డి చంద్రశేఖరరావు అన్నారు. స్థానిక కొండిపర్రు రోడ్డులోని శ్రీచైతన్య ఆగ్రో రైస్ మిల్లు ఆవరణలో గోమాతకు సీమంతాన్ని భార్య ధనలక్ష్మితో కలిసి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజం పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలి అంటూ ప్రతి ఒక్కరూ గోమాతను పూజించాలన్నారు. అనంతరం 54 మంది సువాసినీలతో దంపతులు పసుపు కుంకుమ, పండ్లు మితాయిలతో శాస్త్రోక్తంగా గోమాతకు పూజలు నిర్వహించారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్న సమారాధన చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూపరిషత్ ప్రతినిధి పీఎంఎస్ ప్రసాద్, లయన్స్ సభ్యులు బైసాని నాగేశ్వరరావు, లంకపల్లి శ్రీనివాసరావు, పెరుమాళ్ల రాధాకృష్ణ, ఛాంబర్ ఆఫ్‌కామర్స్ ప్రతినిధి ఊటుకూరి పిచ్చేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామి ఆలయంలో ఇరుముడులు

మండవల్లి: స్థానిక శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో గురువారం అయ్యప్ప స్వాముల ఇరుముడుల కార్యక్రమం నిర్వహించారు. స్వామియే శరణం అయ్యప్పా అంటూ శరణు ఘోషతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం




మండవల్లి: మండలంలోని ఇంగిలిపాకలంకలో అంతర్గత రహదారులు, సీసీ రోడ్డు ఏర్పాటు పనులను గురువారం ప్రారంభించారు. రూ.15 లక్షల ఎన్ఆర్‌జీఈఎస్ నిధులతో చేపట్టే పనులను సర్పంచ్ ఘంటసాల రత్నకుమారి, జెడ్పీటీసీ ముంగర విజయనిర్మల, ఎంపీటీసీ మోరు వెంకటరమణ ప్రారంభించారు.

యువకుడి వైద్యానికి దాతల ఔదార్యం



కైకలూరు: హెపటైటిస్ వ్యాధితో ఐదు నెలలుగా చికిత్స పొందుతున్న రాకేష్ వైద్యఖర్చుల నిమిత్తం అతని కుటుంబ సభ్యులకు కైకలూరు కాపు సంఘం నేతలు రూ.36,500 నగదును అతని ఇంటి వద్ద గురువారం అందించారు. కుటుంబ ఆర్థిక ఇబ్బందులపై వాట్సాప్ గ్రూపులలో తెలియచేయడంతో అనేక మంది దాతలు సాయం చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణా జిల్లా చిరంజీవి యువత అధ్యక్షుడు వర్రె హనుమాన్, కైకలూరు ఎంపీటీసీ మంగినేని రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీక్రిస్మస్



పామర్రు: తోట్లవల్లూరు దైవ స్వరూపి చర్చిలో సెమీక్రిస్మస్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. దైవ స్వరూపి సహవాసం బిషప్ దేవరపల్లి దానియేలు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. అనంతరం క్యాండిల్ సర్వీస్ నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్ వల్లూరు సలోమాన్, షాలెం, సంగతులు తదితరులు పాల్గొన్నారు.

మాలల మహా గర్జనను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దేవీప్రసాద్ తదితరులు

పామర్రు: సుప్రీంకోర్ట్ ఆదేశాలను ఆసరాగా చేసుకుని రిజర్వేషన్లను వర్గీకరించాలని ప్రభుత్వం ఉపక్రమించడం రాజ్యాంగ విరుద్ధ చర్య అని దీనిని వ్యతిరేకిస్తూ దేశ మంతటా వర్గీకరణ వ్యతిరేక ఉద్యమాల్లో భాగంగా ఈనెల 15న గుంటూరు జిల్లాలో 'మాలల మహా గర్జన' నిర్వహిస్తున్నామని అఖిల భారత మాల సంఘాల జేఏసీ చైర్మన్ డాక్టర్ ఉప్పులేటి దేవీప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో నాయకులతో కలిసి మహా గర్జన వాల్ పోస్టర్‌లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ వెంటనే నిలుపు చేయాలన్నారు. క్రిమిలేయర్ విధానాలను ఎస్సీ లకు వర్తింప చేయరాదన్నారు. అంబేడ్కర్ త్యాగంతో ఇచ్చిన రాజ్యాంగ రిజర్వేషన్ ఫలాలు మనం కాపాడుకోలేకపోతున్నామన్నారు. అనంతరం మాలల మహా గర్జన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర నాయకులు పంతగాని రమేష్, మత్తె వడ్డీ కాసులు, నందిపు వెంకట నాంచారయ్య, పులి శ్రీనవాసరావు పాల్గొన్నారు.

కైకలూరు: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 15న గుంటూరు జిల్లా నల్లపాడులో తలపెట్టిన మాల మహాగర్జన సదస్సును విజయవంతం చేయాలని దళిత నాయకులు ఉప్పులేటి దేవీప్రసాద్ పిలుపునిచ్చారు. నల్లపాడు సభ విజయంతంపై గురువారం కైకలూరులో దళిత నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవీప్రసాద్ మాట్లాడుతూ దళితులను విడగొట్టి పరిపాలించు అనే పద్ధతిలో రాజకీయ నేతలు ప్రయత్నిస్తున్నారన్నారు. అందరూ ఏకతాటిపైకి వచ్చి కుట్రలను ఎండగట్టాలన్నారు. నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున దళితులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో మాలమహా సేన జాతీయ అధ్యక్షుడు అలగా రవి, దళిత నేతలు కైకలూరు సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, పళ్ళెం ఏడుకొండలు, బాబూరావు, దానం ప్రసాద్, కురేళ్ళ కిషోర్, గడిదేశి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా నీటి సంఘాల ఎన్నికలు

గుడివాడరూరల్: మండలంలో ఈనెల 14నసాగు నీటి వినియోగదారుల సంఘాలకు సంబంధించి ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వాసిరెడ్డి రామకోటేశ్వరరావు తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలు నిర్వహించే సమావేశ స్థలాల ప్రాంగణాలను ఎంపిక చేశామన్నారు. రామనపూడి సాగునీటి సంఘానికి సంబంధించి రామనపూడిలోని ఎంపీయుపీ స్కూల్‌లో, తట్టివర్రు సాగునీటి సంఘానికి సంబంధించి తట్టివర్రు ఎంపీయూపీ స్కూల్, కోడూరు,పెదపాలపర్రు నీటి సంఘాలకు సంబంధించి చౌటపల్లి జెడ్పీ పాఠశాలలో, వలివర్తిపాడు సాగునీటి సంఘానికి సంబంధించి వలివర్తిపాడు ఎంపీయుపీ స్కూల్‌లో, శేరీగొల్వేపల్లి సాగునీటి సంఘానికి సంబంధించి గ్రామంలోని ఎంపీయూపీ స్కూల్‌లో, మోటూరుకు సంబంధించి గ్రామంలోని జెడ్పీ పాఠశాలలో, పుట్లచెర్వు సాగునీటి సంఘానికి సంబంధించి రుద్రపాక జెడ్పీ పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నామన్నారు.

సాగునీటి ఎన్నికలకు శిక్షణ

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండలంలో శనివారం నిర్వహించనున్న సాగునీటి సంఘాల ఎన్నికలపై గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. తహసీల్దార్ బి.లోకరాజు సమక్షంలో నిర్వహించిన శిక్షణలో ఎన్నికలకు ఏఏ విధులను సిబ్బంది నిర్వహించాలనే అంశాలను గోపాలరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎం.ఆర్.ఐ పి.శివకుమార్, వీఆర్వోలు పాల్గొన్నారు.

గుడివాడ టౌన్: నీటి సంఘాల ఎన్నికలు సక్రమంగా నిష్పక్షపాతంగా జరిగేలా అధికారులు వ్యవహరించాలని గుడివాడ తహసీల్దార్ వి. రామకోటేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక ఎన్జీఓస్ హోమ్‌లో పోలింగ్ అధికారులు, సిబ్బందికి అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14వ తేదీన జరగనున్న ఎన్నికలకు సంబంధించి పూర్తి సామగ్రి అధికారులకు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ బేగ్, ఆర్ఐ నాగబాబు ఇతర అధికారులు పాల్గొన్నారు.

మొవ్వ: మండలంలోని 10 నీటి వినియోగదారుల సంఘాలకు సంబంధించిన ఎన్నికలు ఈనెల 14న నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న తహసీల్దార్ మస్తాన్ గురువారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా సంఘాలకు సంబంధించిన ఎన్నికల నోటిఫికేషన్ పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు పంచాయితీ సచివాలయ కార్యాలయాల్లో ప్రకటించారు. బార్లపూడి సంఘ(150)పాలకమండలి ఎన్నికలు, మొవ్వ సంఘానికి(153) ఎన్నికలు కూడా మొవ్వ జిల్లాపరిషత్ హై స్కూల్‌లో, భట్లపెనుమర్రు లనీటి వినియోగదారుల సంఘం(154) ఎన్నికలు ఆ గ్రామంలోని జెడ్పీ హైస్కూల్, పెదసనగల్లు నీటి వినియోగదారుల సంఘానికి (155) గ్రామంలోని హైస్కూల్లో, పెదముత్తేవి సంఘానికి(156) గ్రామంలోని ఎస్.ఎల్ ఎస్ వి.వి ఓరియంటల్ హైస్కూల్, కోసూరు సంఘానికి(157) ఆ గ్రామంలోని హైస్కూల్లో, అయ్యంకి నీటి వినియోగదారుల సంఘానికి(160) ఆ గ్రామంలోని ఎంపీ ఎలమెట్రీ పాఠశాలలో, మంత్రి పాలెం సంఘానికి(164) ఎంపీయుపి మంత్రిపాలెంలో, కాజ సంఘానికి(165) కాజ హైస్కూల్లో, నిడుమోలు సంఘానికి (174) విడుదల హైస్కూల్లో ఎన్నికలు జరుగుతాయని వివరిస్తూ కేంద్రాలను పరిశీలించినట్లు తెలిపారు.

ముదినేపల్లి రూరల్: మండల వ్యాప్తంగా 134 ప్రాదేశిక నియోజకవర్గాలు, 13 నీటి వినియోగదారుల సంఘాలు 2 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నట్లు తహసీల్దార్ జేఎస్ సుభాని చెప్పారు. వీటిలో ఈ నెల 14న ప్రాదేశిక నియోజకవర్గాలు నీటి వినియోగదారుల సంఘాలకు, 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు జరుగుతాయన్నారు.

పొలం గట్లపై అపరాలు.. తెగుళ్లకు ఆహ్వానమే!



కొందరు రైతులు తమ పొలాల్లో అపరాల సాగులో భాగంగా మరికొంత పంట దిగుబడుల్ని ఆశిస్తూ.. గుడ్లవల్లేరు మండలంలోని పొలంగట్లపై కూడా సాగు చేస్తున్నారు. ఇలా పెంచితే దుష్ఫలితాలు ఉంటాయని.... రైతన్న తనకు తెలియకుండానే తెగుళ్లకు స్వాగతం పలుకుతున్నట్లేనని వ్యవసాయ శాస్త్రవేత్తలు అంటున్నారు. ఇలా గట్లపై అపరాల సాగు చేయొద్దని సూచిస్తున్నారు. –గుడ్లవల్లేరు